నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 29 ఏప్రిల్ 2024 | SANGAREDDY

ఆరు గ్యారెంటీల అమలేదీ?

రూ.4 వేల పింఛన్ హుళక్కేనా?



మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

- 9 ఏండ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- చిన్నశంకరంపేట కార్నర్ మీటింగ్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 28: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం చిన్నశంకరంపేటలో ఐబీ నుంచి స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ రూ.4 వేల పింఛన్‌ను కాంగ్రెస్ అటకెక్కించిందన్నారు. రూ. 2వేల పింఛన్ వచ్చే వారంతా బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేయాలని సూచించారు. వంద రోజుల్లో 6 గ్యారెంటీలు అమలుచేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి 150 రోజులు గడుస్తున్నా ఏమీ చేయడం లేదని, కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్ష, తులం బంగారం అన్నాడు ఏమైందని ప్రశ్నించారు. రైతులకు రూ. 500 బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెప్పాడన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఎందుకు ఇవ్వడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. గ్యాస్, పెట్రో ధరలు పెంచిందే తప్పా, ఒరగబెట్టిందేమీ లేదన్నారు. జీఎస్టీ పేరుతో నిత్యావసరాల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిందన్నారు. బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు ఏడుపాయల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తే ఆ నిధులను కాంగ్రెస్ రద్దు చేసిందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాకు కేటాయించిన 50 కోట్ల నిధులు కూడా ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి వెంకట్రామిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, ఏకే గంగాధర్‌రావు, తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాధవి, పార్టీ మండలాధ్యక్షుడు రాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు రాణమ్మ, సక్కుబాయి, సునీత, నాయకులు కుమార్‌గౌడ్, యాదగిరి యాదవ్, లక్ష్మణ్, ప్రభాకర్, హేమచంద్రం, స్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో ర్యాలీలో పాల్గొన్న అశేషజనం



వెల్దుర్తిలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మెదక్‌లో బీఆర్ఎస్‌కు లక్ష ఓట్ల మెజార్టీ తథ్యం

- ఝూటామాటల రేవంత్‌రెడ్డి...
- కాలం చెల్లిన బాండు పేపర్లు...
- ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తే రాజీనామాకు సవాల్
- నాకు పదవి ముఖ్యం కాదు.. ప్రజల అభివృద్ధి లక్ష్యం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ట్రస్టు ఏర్పాటుతో యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పన
- బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

వెల్దుర్తి ప్రచార సభకు తరలివచ్చిన అశేష జనం

వెల్దుర్తి, ఏప్రిల్ 28: ఎంపీ ఎన్నికల్లో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష ఓట్ల మెజార్టీతో విజయం ఖాయమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం వెల్దుర్తిలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు భారీ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేయడంతో పాటు, వంద రోజుల్లో ఆరు గ్యారంటీల హామీల అమలుకు బాండు పేపర్లు రాసిచ్చారని, ఇప్పుడు ఆ బాండు పేపర్లకు సైతం కాలం చెల్లిందన్నారు. ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం, రైతులను నట్టేట ముంచిందని, రైతుల ఉసురు పోసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడు ఎకరం పంట ఎండిపోలేదని, నేడు కాంగ్రెస్ వచ్చిన తరువాత మొదటి పంటనే ఎండిపోయిందని, నీళ్లు ఉన్నా, కరెంట్ ఉన్నా వాడుకోలేని చేతగాని ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను ప్రజలు నమ్మడం లేదని, ఓటమి భయంతో ఎక్కడికి వెళితే అక్కడ దేవుళ్లపై ఒట్లు పెడుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఝూటామాటల రేవంత్‌రెడ్డి, ఆగస్టు 15 అంటూ నయానాటకం మొదలు పెట్టారని, అప్పటికే రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేయాలని సవాల్ చేస్తే తోకముడిచారన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదని, అభివృద్ధి లక్ష్యమన్నారు. కాళేశ్వర జలాలను మండుటండల్లో హల్దీవాగులో ప్రవహించేలా చేసిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలతో భూగర్భజలాలు, తాగునీటి కష్టాలు తీర్చారన్నారు. పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ హామీలను విస్మరించిందన్నారు.దుబ్బాక ఎన్నికల్లో హామీలను ప్రకటించి, ఒక్కటీ నెరవేర్చలేని రఘునందన్‌రావు మళ్లీ ఓట్ల కోసం ప్రజల ముందుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారిగా సేవలు చేసిన వెంకట్రామిరెడ్డి, చట్టసభల్లో ఉంటే ప్రశ్నించే గొంతుకై నిధుల కోసం పోరాటం చేసి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారని హరీశ్‌రావు అన్నారు. సేవచేసే భాగ్యం కల్పించాలని ప్రజలకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.రూ. 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి మహిళలు, యువత, యువకులకు ఉపాధి శిక్షణ, ఉద్యోగాల కల్పన కోసం కృషి చేస్తా, కోచింగ్ సెంటర్లు పెట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చేలా తీర్చిదిద్దుతానన్నారు. మెదక్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ చేసిన సేవలను, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసపూరిత హామీలను తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సింగాయిపల్లి గోపి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ అనంతరెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, పడిగె నర్సింలు, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణాగౌడ్, మహేందర్‌రెడ్డి, తోటనర్సింలు, సోమప్ప, నాగరాజు, నర్సింలు, స్టేషన్‌శ్రీను, పాండురంగం, బాలేష్‌లతో పాటు వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ...

మాసాయిపేట నుంచి మండలంలోని ఆయా గ్రామాల నుండి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు నాలుగు వందల బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మాసాయిపేటలోని ప్రధాన వీధుల్లో బైక్‌ర్యాలీ నిర్వహించిన అనంతరం ర్యాలీగా బొమ్మారం, కొప్పులపల్లి గ్రామాల మీదుగా వెల్దుర్తికి ర్యాలీగా తరలివచ్చారు. ఈ బైక్ ర్యాలీని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.



శివ్వంపేటలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసం చేసింది

- బీజేపీ ఓటేస్తే పెనం మీదం నుంచి పొయ్యిలో పడ్డట్టే..
- వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- శివ్వంపేట రోడ్ షోలో మాజీ మంత్రి హరీశ్‌రావు

శివ్వంపేట, ఏప్రిల్ 28: ఆగస్టు 15 నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డి పదవి నుంచి దిగిపోవాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం శివ్వంపేటలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలిసి హరీశ్‌రావు భారీ ర్యాలీతో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేస్తే మోసపోయామన్నారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ధ్వజమెత్తారు. మళ్లీ ప్రజలందరూ కేసీఆర్ వైపు చూస్తున్నారని, రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్‌కు ఓట్ల రూపంలో తరుగు తీయాలని రైతులను కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఉన్నతాధికారిగా ప్రజలకు సేవ చేశారని, అతన్ని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీకి ఓట్లు వేస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టేనని హరీశ్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు గోవిందా అనే పాటపాడి అందరినీ ఆకట్టుకున్నారు. అంతకుముందు జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో, ముస్లిములు పీర్ల ఊరేగింపుతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.



శివ్వంపేటలో కార్నర్ మీటింగ్ హాజరైన అశేష జనం

అభివృద్ధి చేస్తా.. పేదలకు సేవలందిస్తా

– బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

మీ కుటుంబ సభ్యుడిగా నన్ను ఆదరించి మెదక్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని, ఐదేండ్ల పాటు మీ సేవకు అంకితమవుతానని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. ప్రజాసేవ చేయాలన్న లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని, రూ. 100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు, పేద విద్యార్థులకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాదిరిగా తాను మోసపూరిత హామీలు ఇవ్వడం లేదని, చేసేదే చెబుతానని, చెప్పిందే చేస్తానని తెలిపారు.

మెదక్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే

- నిస్వార్థ నాయకుడు వెంకట్రామిరెడ్డి
- పీవీఆర్ ట్రస్టు సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్, పీవీఆర్ ట్రస్టు సభ్యులతో సమావేశం

సిద్దిపేట జిల్లా నగరం సమావేశంలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 28: మెదక్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే అని, బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా బీఆర్ఎస్ గెలుపును ఆపలేరని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట–భూంపల్లి మండలం నగరంలోని రామలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ యూత్, పీవీఆర్ ట్రస్టు సభ్యుల(వలంటీర్స్)తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన బీఆర్ఎస్ యూత్, పీవీఆర్ ట్రస్టు సభ్యులు సోషల్ మీడియాతో పాటు గ్రామాల్లో ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాసనసభ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ సాధించిన భారీ మెజార్టీని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి తిరిగి అందించాలని కోరారు. ఈ ఎన్నికల్లో ప్రచారంతో పాటు కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేస్తూ కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. నిస్వార్థంతో ప్రజాసేవకు అంకితమైన వెంకట్రామిరెడ్డి గురించి గ్రామాల్లో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కోరారు. కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎంతోమంది పేదలకు సహాయ సహకారాలు అందించారన్నారు. పేదల సంక్షేమానికి వెంకట్రామిరెడ్డి రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. పీవీఆర్ ట్రస్టు ద్వారా చేపట్టనున్న సేవలను ప్రజలకు వివరించేందుకు పీవీఆర్ వారియర్స్, బీఆర్ఎస్ యూత్ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్స్ నిర్మాణం చేపట్టి నిరుపేదలకు రూపాయికి ఫంక్షన్‌హాల్ వినియోగం, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యకు కావాల్సిన ఆర్థిక సహాయం, పోటీ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ అవకాశం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మనోహర్‌రావు, రొట్టే రాజమౌళి, సోలిపేట సతీశ్‌రెడ్డి, వెంకటనర్సింహ్మారెడ్డి, దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కైలాశ్, నాయకులు కొత్త కిషన్‌రెడ్డి, బనాల శ్రీనివాస్, జీడిపల్లి రవి, పంజాల శ్రీనివాస్, జీడిపల్లి రాంరెడ్డి, మల్లారెడ్డి , కృష్ణ. యూత్ నాయకులు శేఖర్‌గౌడ్, మహేశ్‌రెడ్డి, పీవీఆర్ వారియర్స్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ యూత్, పీవీఆర్ ట్రస్టు సభ్యులు

సంపదను దోచిపెట్టిన బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- ఎన్నికల కోడ్‌తో ఆరు గ్యారెంటీల అమలులో జాప్యం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఏప్రిల్ 28: దేశ సంపద మొత్తాన్ని ఆదానీ, అంబానీలకు దోచిపెట్టి కార్పొరేట్లను పెంచిపోషించిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం కోహెడలోని వేంకటేశ్వర గార్డెన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంపద అంతా ముస్లింలకు పంచుతారనే బీజేపీ అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు. గడిచిన పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం దేశానికి చేసిందేమీ లేదన్నారు. ఓడిపోతామనే భయంతోనే మంగళ సూత్రాలు గుంజుకుంటారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఐదేండ్లలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ చేసిందేమీ లేదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని పదేపదే చెప్పడం సరికాదన్నారు. వంద రోజుల్లో దాదాపు అన్ని గ్యారెంటీలను అమలు చేశామని, పార్లమెంటు ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని గ్యారెంటీల అమలులో జాప్యం జరిగిందన్నారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.4వేల పెన్షన్ ఇస్తామని, వానకాలం పంటకు రూ. 500ల బోనస్ ఇస్తామని, రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కోహెడ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాయమవుతున్న మట్టి!

- యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమార్కులు
- ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో గనులను తలపిస్తున్న యేనె
- నిత్యం వందలాది ట్రిప్పుల తరలింపు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు

హుస్నాబాద్, ఏప్రిల్ 28: హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు మత్తడి ప్రాంతంలోని యేనె రోజురోజుకు తరిగిపోతున్నది. పచ్చని చెట్లు, బండరాళ్లు, వన్య ప్రాణులకు నెలవైన యేనె ప్రాంతం మట్టి మాఫియా చేతుల్లో పడి ఉనికిని కోల్పోతున్నది. నిత్యం జేసీబీలు, ప్రొక్లెయినర్లు పెట్టి వందలాది ట్రాక్టర్లు, పదులకొద్దీ టిప్పర్లు పెట్టి మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మట్టి తరలించేందుకు తగిన అనుమతులు తీసుకోవాల్సి ఉండగా నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. ఒకవైపు ఎల్లమ్మ చెరువుతో పాటు గాంధీనగర్‌లోని చెరువుల్లోంచి మట్టిని ఇటుక బట్టీలకు తరలించడం, మరోవైపు మత్తడిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ ఆధీనంలో ఉన్న యేనె మట్టిని, ఇతర ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల్లోని మట్టిని తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నిత్యం వందలాది ట్రిప్పుల మట్టి తరలిపోతున్నా అటు రెవెన్యూ అధికారులు గానీ, ఇటు మైనింగ్ అధికారులు గానీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ స్థలాల అభివృద్ధికి..

హుస్నాబాద్ పట్టణ శివారులో కొత్తగా వెలుస్తున్న వెంచర్ల డెవలప్‌మెంట్‌తోపాటు కొత్త ఇండ్ల నిర్మాణాలకు కావాల్సిన మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. పట్టణ శివారుతోపాటు ఇటీవల పందిల్ల, బంజేరుపల్లి తదితర గ్రామాల శివారుల్లోనూ కొత్త వెంచర్లు పెట్టి మట్టి పోసి చదును చేసి ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారు. దీంతో మట్టికి డిమాండ్ పెరిగింది. ఒక్కో ట్రిప్పుకు పెద్ద మొత్తంలో చెల్లించేందుకు వినియోగదారులు ముందుకు రావడంతో వాహనాదారులు, జేసీబీల యజమానులు కుమ్మక్కై అనుమతులు తీసుకోకుండానే అక్రమంగా మట్టిని తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండతోనే మట్టి దందా నడుస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. మట్టి దందా ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో చెరువులు, కుంటలు, యేనె ప్రాంతాలు, గుట్టలు ధ్వంసమై పర్యావరణానికి పెను ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపం నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం

అనుమతులు లేకుండానే మట్టి తరలింపు

మట్టిని గానీ, ఇసుకను గానీ తరలించాలంటే రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరి. అనుమతులు ఉంటేనే వాహనాల్లో మట్టి, ఇసుక తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఎందుకంటే మట్టి, ఇసుక తీయడం వల్ల పర్యావరణానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అలా జరుగకుండా ఉంటుందని నిర్ధారించుకున్నాకే అధికారులు మట్టి తీసుకెళ్లేందుకు అనుమతులు ఇస్తారు. ఇందుకు మట్టి అవసరం ఉన్నవాళ్లు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి రసీదు పొందాల్సి ఉంటుంది. కానీ సెలవు రోజుల్లో హుస్నాబాద్ పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారు. మట్టి దందా చేస్తున్న వారి వల్ల వినియోగదారులు ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. అలాగే ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి కూడా గండిపడుతోంది. ఇప్పటికైనా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, నిరంతరం మట్టి, ఇసుక దందాపై నిఘాపెట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మట్టి దందాపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న మట్టి దందాపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం వందలాది ట్రిప్పుల మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు ఇతర దళారులు మట్టిని తరలిస్తున్నారు. మట్టి అవసరం ఉన్న వాళ్లు అధికారులకు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు వస్తాయి. దానికి అనుగుణంగా మట్టిని వా డుకోవచ్చు. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా పర్యావరణం దెబ్బతినేలా మట్టి దందా నడుస్తున్నందున అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకుంటే భవిష్యత్తులో మట్టి అనేది దొరకకుండా పోతుంది.

– కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు